
మనసు మంచిది
-వయసు చెడ్డది
అభాచంద్

హాలీవుడ్ హీరోలా ఠీవిగా తండ్రి గదిలో ప్రవేశించేవాడల్లా తన ప్రక్కన బ్రేకువేసినట్టు ఆగిపోయాడు చిట్టిబాబు.

ఇరవయ్యేళ్ళు మీదపడ్డా యిప్పటికి తండ్రియెదుట పడటమంటే కొంచెం భయమే చిట్టిబాబుకి. అందులోనూ తండ్రి తనకోసం కబురంపటంతో భయానికి ఒణుకు తోడయ్యింది.

అయినా గుండె దిట్టవుచేసుకొని లోపలికివెళ్ళి 'నాన్నగారూ' అని నెమ్మదిగా పిలిచాడు.

కిటికీలోంచి బయటకు చూస్తున్నవాడల్లా వెనుదిరిగారు రామనాధంగారు. ఆయనచేతిలో ఎకనామిక్సు టెక్స్టు పుస్తకం వుంది.

ఇంత డబ్బు సంపాదించిన తర్వాత యిప్పుడు 'ఎకనామిక్సు' అవసరం మిటో అనుకున్నాడు చిట్టిబాబు.

'ఈ పుస్తకం నీదేనా ?' అని ప్రశ్నించా రాయన.

'ఔనండీ' ఇదేంప్రశ్న అన్నట్టుగా సమాధానం యిచ్చాడు చిట్టిబాబు.

'మరి యీ ఫోటో ?' పుస్తకంలోంచి ఫోటో తీసి చూపిస్తూ అడిగారు రామనాధంగారు.

ఎదురుగా బాంబుపడ్డట్టుగా ఫీలయ్యాడు చిట్టిబాబు.

తను యెంతో భద్రంగా దాచుకున్న తన స్వీట్ హార్టు ఫోటో పరుల కంట - అందులోనూ తండ్రి కంటపడాలా !

ఏనాటికైనా తండ్రికి తన ప్రేమ వ్యవహారం నెమ్మదిగా చెప్పి ఆయనను నొప్పించకుండా ఒప్పించాలని, దానికోసం యెన్నో ప్లానులు వేస్తూంటే. ఇప్పుడు అకస్మాత్తుగా ఆయన నిలబెట్టి అడిగితే తను యెలా సమాధానం చెప్పగలడు !

ఐనా నోరు పెగుల్చుకొని చెప్పాడు,

"విశాల అని మా కాలేజి అమ్మాయిది........"

"ఐతే నీదగ్గ రెందుకుంది ?"

"ఆ అమ్మాయి నాకు స్నేహితురాలు, ఆ అమ్మాయి నేనూ........"

"ఏమిటా నసుగుడు ! సరిగాచెప్పు ?"

"నేనూ ఆ అమ్మాయి ప్రేమించుకున్నాం........"

"పెళ్ళి చేసుకోవా లనుకుంటున్నారు. అంతేగా !"

ఔనన్నట్లుగా గబగబా తల ఆడించాడు చిట్టిబాబు.

ఒక్కవిషయం అడుగుతాను నిజం చెప్పు. "ముందు నువ్వు ఆ అమ్మాయిని ప్రేమించావా ? లేక ఆ అమ్మాయి నిన్ను ప్రేమించిందా ?" అన్నారు రామనాధంగారు, సాలోచనగా అతనివంక చూస్తూ.

ఆవిషయం యెప్పుడూ ఆలోచించ లేదు చిట్టిబాబు. ఒకవిధంగా అతనికి మొదటినుంచీ ఆడవాళ్ళంటే బెదురు. వాళ్ళతో మాట్లాడాలంటే మనిషంతా లుంగలుచుట్టుకుపోయేవాడు. ఓసారి ఏదో అవసరంకొద్దీ విశాలతో మాట్లాడాడు. తర్వాత విశాల చొరవచేసుకొని మాట్లాడింది. కొన్నాళ్ళకు యిద్దరూ అతి సన్నిహితంగా మాట్లాడుకున్నారు. ఓ రోజు ప్రొద్దున్నే యిద్దరూ ఒకరినొకరు ప్రేమిస్తున్నాం అనుకొన్నారు. పైకి అనేశారు. అంతటితో ప్రేమ పాకంలోపడి పెళ్ళి వరకు వచ్చింది.

విశాలతండ్రి టీచరు అని, తమకులం కాదని తప్పితే ఆమెగురించి మిగతా వివరాలు అతనికి తెలియవు. ఐనా ప్రేమలో పడ్డవాళ్ళకి వివరాలు-విషయాలు ఎందుకు ? ప్రేమించటానికే టైం చాలక యిబ్బంది పడుతూంటే, అవన్నీ యెవడు పట్టించుకుంటాడు.

అమ్మాయి నచ్చింది. అందంగా, పార్శీపిల్లలా తెల్లగావుండి, రెండుజడలు వేసుకుని, పుస్తకాలు గుండెల కాన్చుకుని మెల్లిగా కాలేజీకి వస్తూంటే చూసి చూసి చివరకు అతని మనస్సు పారేసుకున్నాడు. 'నీవులేక జీవితము గడపలేను ఒకక్షణము' అని పాడుకున్నాడు.

ఫ్లాష్‌బాక్‌లో అంతా వివరంగా చెప్పాడు తండ్రికి చిట్టిబాబు. చివరికి విశాలను గాఢంగా ప్రేమిస్తున్నానని, ఆమె లేకపోతే తను పిచ్చివాణ్ణయిపోతానని, తనసలు పెళ్ళే చేసుకోనని, తను జీవించటంకూడా దుర్లభమని తేల్చాడు.


అంతా విని రామనాధంగారు గది అంతా అదిరేటట్టు గట్టిగా నవ్వారు.

'నీవు నా కడుపున చెడబుట్టావురా, నేను నీకు తండ్రినిగాను-నీవు నా కొడుకువుగావు' వగైరా డైలాగులు విసురుతాడనుకున్న తండ్రి పగలబడి నవ్వేసరికి జడుసుకున్నాడు చిట్టిబాబు ఆయనకు ఏమైనా అయిందేమోనని అనుమానంగా చూశాడు.

రామనాధంగారు వెంటనే గంభీరత్వాన్ని మొహాన్ని పులుముకుని అన్నారు.

'ఒరేయ్ : చిట్టీ ! ఈరోజుల్లో ప్రేమించడమనేది ప్రతివాడికి ఓ ఫ్యాషనయి పోయింది. అసలు ప్రేమ అంటే ఏమిటో మీకు తెలుసా ?

పది సంవత్సరాలు కాపురంచేసి తర్వాత భార్యా-భర్తలమధ్య కలిగేది నిజమైనప్రేమ, నిశ్చలమైనప్రేమ. అంతేగాని అందంగా ఆరోగ్యంగా వయస్సులో వున్న అమ్మాయిలమీద కలిగేది ప్రేమ కాదు: అది ఆకర్షణ కాకపోతే మోహం. అదే మితిమీరితే కామం. దానికి రంగులు పూసుకుని ప్రేమ అని భ్రమిస్తున్నారు. ఒకరి కొకరు దగ్గరగా వున్నంతవరకూ యీ ఆకర్షణనుండి తప్పించుకోలేరు. కొన్నాళ్ళు నువ్వు హైదరాబాదు మీ బాబాయిగారింటికి వెళ్ళిరా. అంతటితో యీ గొడవలన్నీ పోతాయి."




"లేదు నాన్నగారూ: నేను ఆమెను విడిచి యెక్కడకీ వెళ్ళలేను. ఆమెను పెళ్ళిచేసుకోకుండా వుండలేను" దృఢంగా చెప్పాడు చిట్టిబాబు.

"ఐతే నేను యెంత చెప్పినా నువ్వు వినవన్నమాట, సరే! ఆ అమ్మాయి మనకులం కాకపోయినా, వాళ్ళు మన అంతస్తుకి తూగకపోయినా నువ్వు కోరుతున్నావుగనుక మీ పెళ్ళికి నేను అంగీకరిస్తాను" అని ఆగారు రామనాథంగారు.

ఎగిరి గంతెయ్యబోయాడు చిట్టిబాబు. అంతలో రామనాథంగారు మరల అందుకున్నారు.

"కాని, ఒక్క షరతు! నువ్వు యింతకుముందు విశాలగురించి చెప్పిన ప్రేమడైలాగులన్నీ తిరిగి వచ్చే సంవత్సరం యిదేరోజున నాముందు చెప్పు. అప్పుడు తప్పక నీకూ, విశాలకు పెళ్ళి చేస్తాను. ఈ సంవత్సరం గడువు ఎందుకని వద్దనడగొద్దు. ఏమిటి—ఒప్పుకున్నట్టేనా?" అంటూ మందహాసంతో ప్రశ్నించారు రామనాథంగారు.

"ఓస్! ఇంతేనా! ఇదికూడా ఒక షరతేనా" అన్నట్టుగా ఆనందంగా ఒప్పుకున్నాడు చిట్టిబాబు.

ఆతనికి మనస్సు అప్పటికే విశాలతో ముచ్చటలాడటాని కెళ్ళింది

* * *

పల్లెగ్గా విశాలతోతిరగడానికి లైసెన్సు దొరకటంతో పట్టపగ్గాలు లేకపోయాయి చిట్టిబాబుకి. పట్టపగలు, అర్ధరాత్రి అనే భేదంలేకుండా ఆమెతో కాలక్షేపం చేయసాగాడు. సినిమాలకీ, షికార్లకి ఎక్కడికెళ్ళినా జంటగా పోయేవారు.

స్నేహితులు బంధువులు మెదట్లో వింతగా చెప్పుకున్నా అసలుసంగతి తెలిసిన తర్వాత ఎవ్వరూ పట్టించుకోలేదు. సరళ తండ్రికూడా వాళ్ళను ఆటంకపరచలేదు.

ఒంటరిగా ఉన్నప్పుడు చొరవగా విశాలని ఏదో చేయాలని ప్రయత్నంచేశాడు చిట్టిబాబు. కానివిశాల తెలివిగా, అందంగా అతని నుంచి దూరంగా తొలగేది.

ఎప్పుడూ కలసి ఉండటంతో ఆమెమీద 'గామర్' తగ్గింది చిట్టిబాబుకి. ఆమెను చూడాలని ఉన్నా యిదివరకటిలా తహతహలాడేవాడు కాదు.

కొన్నాళ్ళకు విశాలతండ్రి గుండె జబ్బుతో మరణించాడు. అప్పటినుంచి విశాల ఎప్పుడూ ఏదోపోగొట్టుకున్నదానిలా కన్పించేది. ఆమెలోని ఉత్సాహం, చలాకీతనం పోయాయి.

ఒకసారి జ్వరం వచ్చి డబుల్ టైఫాయిడ్‌లోకి దించింది. ఆమె, జుట్టు చాలావరకు ఊడిపోవటంతో మొహంలోని కళ కూడా పోయింది.

యిదివరకటిలా చిట్టిబాబు ఆమెకోసం ఆరాటపడటంలేదు. ఆమెలోని అందం, ఆకర్షణ పోవటంతో వీలైనంతవరకు ఆమెను తప్పించుకొని దూరంగా తిరగసాగాడు. కాని విశాల అతనిని కలుసుకోవటంకోసం ప్రయత్నించేది. ఆమెను మరువలేక దగ్గిర కాలేక కొన్నాళ్లు దూరంగా ఉంటే మనశ్శాంతి లభిస్తుందని బాబాయి దగ్గరికి హైదరాబాదు వెళ్ళాడు చిట్టిబాబు.

* * *

ఊరునించి వచ్చి కారుదిగి లోపల అడుగుపెట్టగానే ఎదురైన సుందరినిచూసి దిమ్మెరపోయాడు చిట్టిబాబు. పొరపాటున ప్రక్కయింటికొచ్చానని అనుకుంటానికి ఎదురుగా తండ్రిఫోటో యింతింత మీసాలతో కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

ఏమీ అర్థంగాక గబగబా తన మేడమీది గదిలోకి వెళ్ళాడు.

సామానుతెచ్చిన నౌకరుని అడిగాడు 'ఎవర్రా ఆ అమ్మాయి' అని. వాడు 'ఏమో చినబాబు! నాకు తెలీదు. మీరూరికెళ్ళిన నాల్గురోజులకొచ్చారు ఆ అమ్మాయిగోరు' అంటూ వెళ్ళిపోయాడు.

డ్రైవరుద్వారా,వంటవాడిద్వారా వివరాలు తొగటానికి ప్రయత్నించాడు చిట్టిబాబు. కాని అంతకు మించి ఏమీ తెలియలేదు.

ఆరోజు రాత్రి ఆమెను పరిచయం చేశాడు తండ్రి "ఒరేయ్! చిట్టీ యీ అమ్మాయి సరళ అని నా స్నేహితుడి

కుమార్తెరా! వాళ్ళ ఊళ్ళో కాలేజీ లేదు. అందుకని మనింట్లోనే ఉండి చదువుకుం టుంది. ఏదన్నా కావలిస్తే చెబుతాడు". తండ్రిమీద తాటిచెట్టు అంతన కోపం వచ్చింది చిట్టిబాబుకి.

'చిట్టి. ఏమిటి చిట్టీమ, చట్టీను! అంద మైన అమ్మాయి ముందుకూడా అలా పిలుస్తాడు' అని విసుక్కున్నాడు.

కాని ఆ అమ్మాయి తమ యింటిలోనే ఉంటుందని తెలియగానేఅతనిలోఉత్సాహం ఉప్పొంగింది.

సరళతో మాట్లాడాలని ఎన్నోసార్లు ప్రయత్నించాడు చిట్టిబాబు. కాని సరళ ఏదో వంకతో అతనికి ఎప్పుడూదూరంగా పోయేది, అంతటితో ఆమెమీది ఆకర్షణ మరీ ఎక్కువయింది చిట్టిబాబుకి.

పరీక్షలు దగ్గరపడటంతో తప్పనిసరిగా చిట్టిబాబుతో కొన్ని పాఠాలు చెప్పించుకో వలసిన అవసరం ఏర్పడింది సరళకు. రోజూ ఓ గంట ఆమెకు తెలియంది తనకు తెలిసినవి చెప్పేవాడు చిట్టిబాబు.

క్రమంగా వారిద్దరిమధ్య సన్నిహితం ఏర్పడింది. చిట్టిబాబు సరళను విడి ఉండ లేకపోయేవాడు. యిదివరకు కారుని పట్టుకువెళ్లే వాడల్లా యిప్పుడు యింటి పట్టున సరళ నీడలోనే నివాసం ఉంటు న్నాడు.

సరళ అందమంతా ఆమె కళ్ళలోనే ఉంది. ఆమె కొంటెగా చూస్తూ, కలిపిగా నవ్వుతూ చలాకీగా మాట్లాడుతూ ఉంటే చిట్టి బాబు ఉద్రేకపడేవాడు.

అతనికి విశాలతో గడపిన క్షణాలు, ఆమెకుచూపిన ఆశలు అన్నీ లీలగా గుర్తు కొస్తున్నాయి. కాని అతను అన్నీ తేలికగా మర్చిపోతున్నాడు. విశాల ఏమైంది కూడ, అతనికి తెలియదు.

అతనికి ఒకటే ధ్యేయం!

"సరళతనదికావాలి. ఆమె అందాలన్నీ తన స్వంతంకావాలి!" అదే అతని తపన.

దాని పరిణామాలు ఆలోచించే స్థితిలో లేదు.


ఒకసారి కాఫీ తెబోతూ చీరకుచ్చిళ్ళు అడ్డంపడి జారి పడబోయింది సరళ. ప్రక్కనే వున్నచిట్టిబాబు గబుక్కునఆమెని పొదివిపట్టుకున్నాడు.

కప్పు క్రిందపడి ముక్కలయింది, కాఫీ ఒలికి అతని షర్టుమీద పడింది. సరళ బిక్కమొగంతో అతనిని చూస్తూ నిలుచుంది, చిట్టిబాబు ఆమెను సముదా యించి ఆమె గదిలోకి తీసుకెళ్ళాడు,

ఆమె స్పర్శ అతనికి కొత్తఅనుభూతి అతన్ని విడిచిపోలేదు, ఆ అనుభూతి యింకా కావాలని మనస్సు ఆరాటపడింది. అయినా నిగ్రహించుకున్నాడు.

ఒకసారి చిట్టిబాబు యింటికొచ్చేసరికి సరళ అప్పుడే స్నానంచేసి ఒంటికి టవల్ కప్పుకొని తన గదిలోకి పోతూ కన్పిం చింది.

ఆమెలోని అందాలు చూసి అతని



మనస్సు చలించింది. ఆమెను ఎలాగైనా తనదాన్ని చేసుకోవాలనుకున్నాడు. కాని తండ్రితో చెప్పటానికి జంకాడు.

ఒకరోజు చిట్టిబాబు సరళ ఒంటరిగా గదిలో కూర్చుని చదువుకుంటున్నారు. రామనాథంగారు ఊరు వెళ్ళారు. నౌకర్లందరు కింద నిదురపోతున్నారు.

చిట్టిబాబు వేసిన జోకుకి సరళ విపరీతంగా నవ్వటంలో ఆమె పైట జారిపోయింది. లోనెక్ జాకెట్‌లోంచి కన్పించిన ఆమెలోని ఒంపులు అతన్ని ఉద్రేకపరిచినాయి. ఆమె నవ్వులు, ఆమె జడలోని పువ్వులు, ఒంటరితనం బయటి వాతావరణం అన్నీ అతనికి నిషా కల్గించి అతనిలోని కోర్కెల్ని రెచ్చగొట్టాయి,

వెంటనే ఆమెను తన గుండెలకదుముకొని ఆమె పెదవులనందుకోవాలని ప్రయత్నించాడు. పరిస్థితిని గ్రహించి సరళ అతని కౌగిలి విడిపించుకోవాలని ప్రయత్నించింది.

కాని చిట్టిబాబు ఆమెను యింకా బంధించి ఏదో చేయాలని ఆరాటపడసాగాడు. ఆమె ఏడ్చినా, కొట్టినా, రక్కినా బ్రతిమాలినా అతను తన ప్రయత్నం మానలేదు.

అదే సమయంలో యింటి ముందు కారాగిన చప్పుడైంది. రామనాథంగారు కారులోంచి దిగారు. చిట్టిబాబు ఉద్రేకం చల్లబడింది. సరళ గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

రామనాథంగారు ఆ గదిలో అడుగు పెట్టేసరికి వాతావరణం మారిపోయింది. చిట్టిబాబు ఏదో పాఠం చెబుతున్నాడు. సరళ శ్రద్ధగా వింటోంది. క్షణం క్రితం ఆ గదిలో ఉన్న ఉద్రేక పూరిత వాతావరణపు ఛాయలుకూడా లేవు.

* * *

మర్నాడు తండ్రి ముందు నిలబడి ఉన్నాడు చిట్టిబాబు.

"నాన్నగారూ! నేను పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాను."

"ఎవరిని? విశాలనా?"

"కాదు సరళని."

"సరళనా మతి ఉండే మాట్లాడుతున్నావా!"

"అవును నాన్నగారూ! నేను సరళనే పెళ్ళి చేసుకుంటాను. ఆమె లేకుండా నేను జీవించలేను,"

"ఒరేయ్ చిట్టీ! సరిగ్గా సంవత్సరం క్రితం యిదేరోజున నువ్వు విశాలగురించి యిదే మాటలన్నావు. యీ రోజుకూడ యీ మాటలు విశాలగురించి నువ్వు అని ఉంటే నేను ఎంతో సంతోషించేవాడిని. మీ పెళ్ళి మనస్ఫూర్తిగా చేసి ఉండేవాడిని కాని...."

"నిజమే నాన్నగారూ! ఒకప్పుడు నేను విశాలను ప్రేమించాను. కాని యిప్పుడు సరళ లేకుండా ఉండలేని పరిస్థితిలో ఉన్నాను. నేను ఆమెను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను." దృఢంగా అన్నాడు చిట్టిబాబు.

"ఒరేయ్ చిట్టీ! యింకా ప్రేమ,ప్రేమ అంటూ నాముందు మాట్లాడటానికి సిగ్గు వేయటంలేదూ! నేను ఆనాడే చెప్పాను నీది క్షణికమైన ఉద్రేకం అనీ, ప్రేమ కాదని.

విశాల అందంగా ఉన్నప్పుడు ప్రేమించావు. పెళ్ళి చేసుకోవా లనుకున్నావ్. ఆమెలో అందం అకర్షణ పోగానే ఆమెను మరచిపోయావ్. ఆమె కంటే సరళ అందంగా కన్పడేసరికి ఆమెను ప్రేమిస్తున్నాననుకున్నావ్. రేపు సరళ కంటే అందమైన మరో సుశీల కన్పడితే సరళను మరిచిపోయి ఆ అమ్మాయిని ప్రేమిస్తావ్.

యిదంతా నీ తప్పుకాదు · నీ వయస్సుది. నీ మనస్సు మంచిదే. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలమకున్నావ్. కానివయసు మహా చెడ్డది. వయస్సులో ఉన్న ప్రతిస్త్రీ అందంగానే కన్పిస్తుంది. ప్రతీ స్త్రీతోను పరిచయం కావాలనిపిస్తుంది.

పెళ్ళి చేసుకొంటే యిలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు రావు, అందువలన ఓ మంచి సంబంధం చూస్తాను పెళ్ళిచేసుకో అంటూ దీర్ఘోపన్యాసం యిచ్చారు రామనాథంగారు.

చిట్టిబాబు కిదేమీ రుచించలేదు,

"లేదు నాన్నా నేను ఏమైనాసరే సరళనే పెళ్ళి చేసుకుంటాను. ఆమె లేకపోతే నెను పిచ్చివాణ్ణయిపోతాను" తిరిగి నొక్కి చెప్పాడు చిట్టిబాబు.

"అలాగా సరే! ఉండు" అంటూ సరళా, సరళా అంటూ కేకవేశారు రామనాథంగారు. సరళ నెమ్మదిగా వచ్చింది.

"రామ్మా! సరళా! మీ ఆయన ఏం చేస్తున్నాడో ఒక్కసారి చెప్పు. చిట్టి వింటాడట" చిట్టిబాబు వంక చూస్తూ అన్నారు రామనాథంగారు.

సరళ ఏమీ జవాబియ్యలేదు. పమిట కొంగు తీసుకొని తలమీదకు సర్దుకుంది. ఆ సమయంలో ఆమె మెడలోని మంగళ సూత్రం చూసి షాక్ తిన్నాడు చిట్టిబాబు. పిచ్చివాడిలా ఆమెవంక చూస్తూ అలాగే నిలిబడ్డాడు.

"యిక నువ్వు లోపలకి వెళ్ళమ్మా" అని రామనాథంగారు అనటంతో సరళ గబగబా వెళ్ళిపోయింది.

"ఒరేయ్ చిట్టీ! యిప్పటికైనా అర్ధమైందా ఆవేశంలో నీవు ఎంత పాపాని కొడిగాట్టావో సరళ భర్త అమెరికాలో ఉన్నాడు, అతను తిరిగి వచ్చేవరకు ఒంటరిగా వుండటంకంటే ఏదోవ్యాపకం ఉంటే మంచిదని నేనే ఆమెను మనింట్లో ఉండి చదువుకొమ్మని పిలిపించేను.. వయస్సులోని ఉద్రేకం ఎలాంటి అనర్ధాలు జరుగుతాయో యిప్పటికైనా గ్రహించావా!" గంభీరంగా అన్నారు రామనాథంగారు.

చిట్టిబాబు ఏమి మాట్లాడకుండా తల వంచుకొని వెళ్ళిపోయాడు ట్రాజెడీ హీరోలా.

* * *

ఆ తరువాత చిట్టిబాబు 'ప్రేమ' అనే మాట పొరపాటున కూడా ఎప్పుడూ అనలేదు. తండ్రి కుదిర్చిన సంబంధమే చేసుకొన్నాడు. కాని సరళ అనే వ్యక్తి ఒక నటి అనిగాని; ఆమెకసలు పెళ్ళి కాలేదని ఆమెను తనమీది ప్రయోగం కోపమే తండ్రి వినియోగించాడని అతని కింత వరకు తెలియదు. పాపం! చిట్టిబాబు! *